క్లుప్తంగా

జగనన్న లేఅవుట్ క్షేత్ర పరిశీలన



మర్రిపాడులో జగనన్న లేఅవుట్ పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ సంజనా సిన్హా

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మర్రిపాడులోని పోలీసు క్వార్టర్స్‌కు ఎదురుగా ఉన్న జగనన్న లేఅవుట్‌ను ట్రైనీ కలెక్టర్, మర్రిపాడు తహసీల్దారు సంజనా సిన్హా సోమవారం క్షేత్ర పరిశీలన చేశారు. నూతల గ్రామానికి చెందిన పది మంది పేదలకు ఈ లేఅవుట్‌లో ప్రభుత్వ పట్టాలు మంజూరు చేయగా, వారిలో కొందరు తమకు కేటాయించిన పట్టా స్థలంలో కాకుండా మరికొంత భాగం వెనుకనే ఉన్న వాగుపోరంబోకు స్థలాన్ని ఆక్రమించారనే ఫిర్యాదు రావడంతో ఆమె ఆ లేఅవుట్ స్థలాన్ని పరిశీలించారు. మర్రిపాడు తహసీల్దారు ఆనందరావు, హౌసింగ్ ఏఈ రవికుమార్‌కు లేఅవుట్‌కు సంబంధించిన సమగ్ర వివరాలను తనకు అందించాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా లబ్ధిదారులు ఇళ్లు నిర్మించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ మస్తాన్‌ఖాన్, ఆర్‌ఐ సురేంద్ర, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఆర్థిక సహకారం

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం ద్వారా పలు విభాగాల్లో ఆర్థిక ప్రోత్సాహకాలు అందిస్తున్నామని వెలుగు ఏపీఎం బుజ్జమ్మ తెలిపారు. మర్రిపాడులోని వెలుగు కార్యాలయంలో మండలంలోని ఎఫ్‌పీఓ వార్షిక సమావేశం సోమవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మర్రిపాడు పరస్పర రైతు సహకార సంఘానికి రూ.2.43 లక్షలు ఆదాయం వచ్చిందన్నారు. మర్రిపాడు మండలంలో మిరప సాగు అధికంగా ఉన్నందున రైతుల ఉత్పత్తులను ఎగుమతి చేసేందుకు అవసరమైన సహకారాన్ని సమాఖ్య ద్వారా చేపడతామన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు క్రమం తప్పకుండా పొదుపు చెల్లించేలా నిలిచిపోయిన సంఘాలను తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. కార్యక్రమంలో ఎఫ్‌పీఓ అధ్యక్ష, కార్యదర్శులు నరసింహా, బాషా, పలువురు ఎఫ్‌పీఓ సభ్యులు, పాల్గొన్నారు.

వినతులకు సత్వర పరిష్కారం చూపాలి



స్పందన వినతులు పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ సంజనా సిన్హా

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): జగనన్నకు చెబుదాం పేరుతో ప్రభుత్వం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే వినతులకు సత్వర పరిష్కారం చూపాలని ట్రైనీ కలెక్టర్, మర్రిపాడు తహసీల్దారు సంజనా సిన్హా అన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో కలిసి సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ప్రజా విజ్ఞప్తులు స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ శాఖాధికారి ప్రజల నుంచి వచ్చే వినతులను నిర్దిష్ట కాలపరిమితిలోగా పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో డీటీ ఆనంద్‌రావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ మస్తాన్‌ఖాన్, ఎంఈఓ ధనలక్ష్మి, వెలుగు ఏపీఎం బుజ్జమ్మ, ఏఓ రామ్మోహన్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, హౌసింగ్ ఏఈ లు రవితేజ, యాసిన్, రవికుమార్, వైద్యశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

13న దగదర్తిలో జగనన్నకు చెబుదాం

కావలి: ఈ నెల 13వ తేదీన దగదర్తి మండల పరిషత్ కార్యాలయంలో కలెక్టర్, జిల్లా అధికారుల ఆధ్వర్యంలో జగనన్నకు చెబుదాం జరుగుతుందని జిల్లా సమాచార శాఖ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా 29వ తేదీ కావలిలో జగనన్నకి చెబుదాం కార్యక్రమం మండల పరిషత్ కార్యాలయంలో కలెక్టర్ ఆధ్వర్యంలో జరుగుతుందని వివరించారు. అన్ని శాఖల అధికారులు పాల్గొనే ఈ కార్యక్రమానికి మండలంలోని ప్రజలు హాజరై తమ సమస్యలు తెలియజేయాలని కోరారు.

రేపటి నుంచి స్కూల్ గేమ్స్ జట్ల ఎంపికలు

చేజర్ల(సోమశిల): ఈ నెల 13, 14 తేదీల్లో అనంతసాగరం మండల స్థాయి స్కూల్ గేమ్స్ జట్ల ఎంపికలు జరుగుతాయని గేమ్స్ మండల కన్వీనర్, రేవూరు జెడ్పీహెచ్ఎస్ పీడీ గౌరీరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 13వ తేదీ అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, యోగా, వాలీబాల్, 14న కబడ్డీ, ఖోఖో, టెన్నీకాయిట్, త్రోబాల్ క్రీడలకు సంబంధించి బాల బాలికల జట్ల ఎంపికలు జరుగునని తెలిపారు. ఈ పోటీలు కొత్తపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అండర్-17 బాలబాలికలకు 15వ తేదీన రెజ్లింగ్, హాకీ, వాలీబాల్, టెన్నీకాయిట్ క్రీడాకారుల ఎంపిక నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరుగుతాయని తెలిపారు. ఆయా పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్ కార్డు తీసుకురావాలని కోరారు.



కావలి: యథావిధిగా నడిచిన ఆర్టీసీ బస్సులు



కావలి: రైతు బజార్ వద్ద రద్దీ వాతావరణం



అల్లూరు: స్టేషన్ ప్రాంగణంలో టీడీపీ నాయకులు

ఊసేలేని బంద్

- సాధారణంగా సాగిన పౌర జీవనం
- యథావిధిగా ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంక్‌లు, పాఠశాలలు
- తెరుచుకున్న దుకాణాలు, నడిచిన ఆర్టీసీ బస్సులు

కావలి: టీడీపీ అధినేత చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంలో పక్కా ఆధారాలతో దొరికిపోయి అరెస్ట్ అయిన నేపథ్యంలో టీడీపీ పిలుపు ఇచ్చిన రాష్ట్ర బంద్‌ను కావలి నియోజకవర్గ ప్రజలు పట్టించుకోలేదు. సోమవారం యథావిధిగా పౌర జీవనం సాగింది. వాణిజ్య సంస్థలు, వ్యాపార దుకాణాలు, పాఠశాలల మూత పడలేదు. ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంక్‌లు యథావిధిగా తెరుచుకున్నాయి. ఆర్టీసీ బస్సులు సాధారణంగా తిరిగాయి. ప్రజలు సైతం కావలికి నిత్యం తమ అవసరాల కోసం రాకపోకలు సాగించినట్లే సోమవారం కూడా సాధారణంగా ఎవరి పనుల్లో వారు నిమగ్నమయ్యారు. బంద్‌పై స్థానికుల్లో ఎక్కడా వినిపించకపోగా, బందు లేదు.. గిందు లేదు అనే మాటలు బాహాటంగానే వ్యాఖ్యానించడం గమనార్హం.

తమ్ముళ్ల బంద్ ఫొటో షూట్

బంద్ చేయడానికి కూడా ఆ పార్టీ శ్రేణులు బయటకు రాలేదు. ఏదో చేయాలని, సోషల్ మీడియా ప్రచారం కోసం తమ్ముళ్లు ఫొటో షూట్ చేసుకుని మమ అని పించారు. కావలి టీడీపీ ఇన్‌చార్జి మాలేపాటి సుబ్బానాయుడు, పట్టణ నాయకుడు గుత్తికొండ కిషోర్ తెర వెనుక ఉండి కార్యకర్తలతో డూప్ షో చేయడానికి చిన్న ప్రయత్నం చేశారు. పార్టీ అగ్ర నాయకత్వానికి పంపుకోవడానికి, పార్టీ సోషల్ మీడియాలో పెట్టుకోవడానికి కండువాలతో రోడ్డుపై నిలబడి బంద్ ప్లకార్డులు పట్టుకుని షో చేశారు. తప్పు చేసిన చంద్రబాబు కోసం రోడ్ల మీదకు వచ్చి జనం దృష్టిలో పలచన కావడం అవసరమా అని పలువురు ద్వితీయ శ్రేణి నేతల నుంచి కార్యకర్తల వరకు ప్రశ్నించడంతో బంద్‌కు ఆ పార్టీ శ్రేణుల నుంచే స్పందన కరువైంది.

ఫొటోలతో జనసేన సంతృప్తి

టీడీపీ బంద్‌కు జనసేన మద్దతు అని ప్రకటించినప్పటికీ కావలిలో ఆ పార్టీ ఇన్‌చార్జి అలహరి సుధాకర్ పత్తా లేకుండా పోయారు. నాయకులుగా చెలామణి అవుతున్న ఒకరిద్దరు పోలీసులు హౌస్ అరెస్ట్, పోలీస్‌స్టేషన్‌కు తరలించారంటూ ఫొటోలు తీసుకుని బంద్‌కు మద్దతు మమ అనిపించారు.

బంద్‌ను పట్టించుకోని ప్రజలు

బిట్రగుంట: బోగోలు, దగదర్తిలో టీడీపీ నాయకులు సోమవారం చేపట్టిన బంద్‌కు ప్రజల నుంచి స్పందన కరువైంది. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్ట్ అయిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుకి మద్దతుగా ఆ పార్టీ నాయకులు బంద్‌కు పిలుపునివ్వగా ఒక్కరూ కూడా పట్టించుకోలేదు. వ్యాపార సంస్థలు, దుకాణాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు యథావిధిగా కొనసాగాయి. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంతా టీడీపీ నాయకులను ముందస్తుగానే హౌస్ అరెస్ట్ చేయడం, కార్యకర్తలు పట్టించుకోకపోవడంతో బంద్ ఊసే కనిపించలేదు.

అల్లూరు: చంద్రబాబు అరెస్ట్‌కు సామాన్య ప్రజల నుంచి మద్దతు కరువైంది. అల్లూరులో పెద్దగా బంద్ ఛాయలే కనబడలేదు. దుకాణాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు యథావిధిగా తెరుచుకున్నాయి. స్థానికంగా ఆ పార్టీలోని పట్టుమని పది మంది కార్యకర్తలు చంద్రబాబు అరెస్ట్ నిరసిస్తూ టీడీపీ కార్యాలయం నుంచి ర్యాలీగా వస్తుండగా ఎస్సై పి. శ్రీనివాసులరెడ్డి వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. బీద గిరి,, బుల్లా కృష్ణారెడ్డి, బండి శ్రీనివాసులు, కృష్ణచైతన్య, షేక్ నజీర్ తదితరులు ఉన్నారు.

ఉదయగిరిలో బంద్ విఫలం



ఉదయగిరిలో కనిపించని బంద్ ప్రభావం



కలిగిరిలో పాక్షికంగా బంద్

- అధినేత చంద్రబాబుకు రిమాండ్ విధించినా స్పందించని కేడర్
- అక్కడక్కడా ఉనికి చాటుకునే ప్రయత్నం చేసిన మండల నేతలు

ఉదయగిరి: టీడీపీ అధినేత చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంలో జైలు పాలైన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆ పార్టీ ఇచ్చిన బంద్ పిలుపు ఉదయగిరిలో విఫలమైంది. ప్రధానంగా పార్టీ నేతలు, కేడరే బయటకు రాలేదు. కొన్ని చోట్ల పార్టీ మండల నేతలు కొంత మంది బంద్ చేసేందుకు ప్రయత్నించినా స్థానిక వ్యాపారులు, విద్యాసంస్థలు, ప్రజలు సహకరించకపోవడంతో మౌనంగా ఉండిపోయారు. మూడు రోజుల నుంచి చంద్రబాబుకు మద్దతుగా బయటకు వచ్చి ఆందోళన చేయాలని పార్టీ అధిష్టానం పిలుపు ఇస్తున్నప్పటికీ ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్దగా స్పందించకపోవడంతో ఉదయగిరి నియోజకవర్గంలో కనీస స్పందన లేకపోవడం గమనార్హం. ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు యథావిధిగా తిరిగాయి. దుకాణాలు, విద్యాసంస్థలు, వ్యాపార సంస్థలు, బ్యాంకులు, ఇతర ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలు యథావిధిగానే తమ విధులు, కార్యకలాపాలు నిర్వహించాయి. వింజమూరులో బంద్ ఊసే కనిపించలేదు. ఉదయం 10 గంటల సమయంలో ఐదారుగురు కార్యకర్తలు ప్రభుత్వ పాఠశాలలు మూసివేసేందుకు ప్రయత్నించారు. ఉదయగిరిలో బంద్ ఊసే లేదు. అన్ని విద్యాసంస్థలు, వ్యాపార కార్యకలాపాలు యథావిధిగా తెరుచుకున్నాయి. సీఐ వి.గిరిబాబు, ఎస్సై ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు వేకువ జామునుంచే పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. కొందరు నేతలను ముందుగానే అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్ తరలించడంతో ఆ పార్టీ ద్వితీయ శ్రేణి నేతలు, కేడర్ బజారు వైపే కన్నెత్తి చూడలేదు. కొండాపురంలో ఒకరిద్దరు టీడీపీ నేతలు సెల్ టవరు ఎక్కి హంగామా చేయడానికి ప్రయత్నించిన నేపథ్యంలో ఎస్సై ఖాజావలి వారిని అదుపులోకి తీసుకున్నారు. అక్కడ బంద్ ఊసే కనిపించలేదు. కలిగిరిలో కొంతమంది టీడీపీ నేతలు దుకాణాల యజమానుల వద్దకు వెళ్లి పది నిమిషాలు దుకాణాలు మూసేయండి.. తాము ఫొటోలు తీసుకునేంత వరకు సహకరించండి అంటూ బతిమిలాడటంతో కొంత మంది వ్యాపారులు అరగంట సేపు దుకాణాలు మూసివేశారు. కేవలం ఉనికిని చాటుకునేందుకే మండల నేతలు ప్రయత్నం చేశారు. టీడీపీ ఇన్‌చార్జి బొల్లినేని సొంత మండలమైన కలిగిరిలో కూడా బంద్ ప్రభావం కనిపించకపోవడం, బొల్లినేని ఆచూకీ మూడు రోజులుగా లేకపోవడంతో ఆ పార్టీ నేతలు తీవ్ర నైరాశ్యంలో ఉన్నారు. జలదంకిలో కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ఉద్యోగులు నిరాహార దీక్ష చేసేందుకు ప్రయత్నిస్తుండగా ఎస్సై ఆదిలక్ష్మి వారిని వారించి అక్కడి నుంచి పంపించేశారు. వరికుంటపాడు మండలం తిమ్మారెడ్డిపల్లిలో నలుగురైదుగురు టీడీపీ నేతలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి రోడ్డుపై బైఠాయించడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. దుత్తలూరు, సీతారామపురం మండలాల్లో బంద్ ఊసే కనిపించలేదు.



వరికుంటపాడు మండలం తిమ్మారెడ్డిపల్లిలో రోడ్డుపై బైఠాయించిన వేళ్లమీద లెక్క పెట్టగలిగిన టీడీపీ కార్యకర్తలు

యథావిధిగా జనజీవనం



ఆత్మకూరు: టీడీపీ నాయకులను పోలీసుస్టేషన్‌కు తరలించిన దృశ్యం



మర్రిపాడులో జాతీయ రహదారిపై బందోబస్తు నిర్వహిస్తున్న ఎస్సై విశ్వనాథరెడ్డి, సిబ్బంది



ఆత్మకూరు ఆర్టీసీ డిపో వద్ద నిరసన కారులతో మాట్లాడుతున్న సీఐ వేణు, ఎస్సై ముత్యాలరావు

- ఆత్మకూరు నియోజకవర్గంలో ఊసే లేని బంద్
- హడావుడి చేసిన టీడీపీ నేతల అరెస్ట్

ఆత్మకూరు: స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంలో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబును రిమాండ్‌కు తరలించడంతో టీడీపీ శ్రేణులు సోమవారం బంద్‌కు పిలుపునిచ్చినా.. ఆత్మకూరు నియోజకవర్గంలో బంద్ ఊసే కానరాలేదు. యథావిధిగా జనజీవనం సాగింది. ఆత్మకూరు, మర్రిపాడులో హడావుడి చేసేందుకు ప్రయత్నించిన కొందరు టీడీపీ నేతలను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ప్రధానంగా పార్టీ శ్రేణుల నుంచి బంద్‌కు మద్దతు రాకపోవడంతో ద్వితీయ శ్రేణి నాయకులు సైతం ముఖం చాటేశారు. పార్టీ వీరభిమాన నేతలు చేతి వేళ్ల మీద లెక్కించగలిగినంత మంది హడావుడి చేసేందుకు ప్రయత్నించారు. అంబేడ్కర్ బొమ్మ వద్ద, బైపాస్ రోడ్డు ఆంజనేయస్వామి ఆలయ కూడలి వద్ద, నెల్లూరుపాళెం సెంటర్‌లో రహదారిపై నిరసన వ్యక్తం చేసేందుకు టీడీపీ నాయకులు ప్రయత్నిస్తుండగా వారిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఆత్మకూరులో బంద్ ఊసే లేకపోవడంతో దుకాణాలు యథావిధిగా తెరుచుకుని వ్యాపారాలు నిర్వహించాయి. బస్సుల రాకపోకలు సాగాయి. టీడీపీ చంద్రబాబు అరెస్ట్‌పై కనీసం సామాన్య ప్రజల్లో సైతం చర్చ కూడా లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుందని పలువురు విశ్లేషించారు.

టీడీపీ నాయకుల బైండోవర్

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): టీడీపీ బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో మర్రిపాడులో స్థానిక ఆ పార్టీ నాయకులు ఆందోళన చేపట్టేందుకు బస్టాండ్ సెంటర్ చేరుకున్నారు. ఆత్మకూరు సీఐ వేణుగోపాల్ రెడ్డి, మర్రిపాడు ఎస్సై విశ్వనాథరెడ్డి వారిని వెంటనే అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఆరికట్ల జనార్దన్‌నాయుడు, శాఖమూరి నారాయణ, పాళెం పోలయ్య, యలగాల వెంకటేశ్వర్లు, కమతం గురవారెడ్డి, తదితర 20 మందికి పైగా టీడీపీ నాయకులపై బైండోవర్ కేసులు నమోదు చేసి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఎస్సై విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో 67వ నంబరు జాతీయ రహదారిపై నెల్లూరు నుంచి ఆత్మకూరు, బద్వేలు, కడప, మైదుకూరు, జమ్మలమడుగు, పులివెందుల వైపులకు రాకపోకలు సాగించే బస్సులకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు. హోటళ్లు, వ్యాపార సముదాయాలు యథావిధిగా తెరుచుకున్నాయి.

ఆర్టీసీ డిపో ముట్టడి విఫలం

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు ఆర్టీసీ డిపో వద్ద బస్సులను అడ్డుకునే ప్రయత్నం చేసిన టీడీపీ నేతలను సీఐ వేణు, ఎస్సై ముత్యాల రావు తమ సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకున్నారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ తుమ్మల చంద్రారెడ్డి, మండల కార్యదర్శి కేతా విజయభాస్కర్‌రెడ్డి, పిడికిటి వెంకటేశ్వర్లు, గొట్టిగుండాల బుజ్జిరెడ్డి, తదితరులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీంతో ఆర్టీసీ బస్సులు యథావిధిగా రాకపోకలు సాగించాయి.

కనిపించని బంద్

అనుమసముద్రంపేట: చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా చేపట్టిన బంద్ ఏఎస్‌పేటలో విఫలమైంది. తెలుగు తమ్ముళ్లు ఎవరూ రోడ్డుపై రాకపోవడంతో బంద్ ఛాయలే కనిపించలేదు. దుకాణాలు ఉదయమే తెరుచుకుని తమ వ్యాపారాలను కొనసాగించాయి. బస్సులు సైతం ప్రయాణికులకు, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ అధికారులు తమ రవాణాను కొనసాగించారు. ఏఎస్‌పేట ఎస్సై నరేష్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

బంద్ ఊసేలేదు

సంగం: చంద్రబాబు అరెస్ట్ నేపథ్యంలో టీడీపీ సోమవారం చేపట్టిన బంద్ వాతావరణం మండంలో ఎక్కడా కనిపించలేదు. సంగం పోలీసులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందుగానే టీడీపీ నాయకులను హౌస్ అరెస్ట్ చేశారు. ఉదయం నుంచి సంగం సీఐ రవినాయక్ ఆధ్వర్యంలో ఎస్సై నాగార్జునరెడ్డి, పోలీసులు అన్ని గ్రామాల్లో పర్యటిస్తూ ఎక్కడా అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోండా గస్తీ నిర్వహించారు.

బంద్ వాతావరణమే లేదు

చేజర్ల: చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా టీడీపీ నాయకులు చేపట్టిన బంద్ చేజర్ల, అనంతసాగరం మండలాల్లో బంద్ వాతావరణమే కనిపించలేదు. ఆ పార్టీ నాయకులు కొందరు దుకాణాల యజమానులు బతిమిలాడుకోవడంతో కొద్దిసేపు మూతవేసి.. తర్వాత యథావిధిగా కార్యకలాపాలు నిర్వహించారు. చేజర్ల మండల టీడీపీ అధ్యక్షుడు రావి లక్ష్మీనరసారెడ్డితో పాటు పలువురు ముఖ్య నేతలను సైతం పోలీసులు ముందుగానే హౌస్ అరెస్ట్ చేశారు. అనంతసాగరం టీడీపీ నేత రవీంద్రరెడ్డిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. మండలంలో దుకాణాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు యథావిధిగా పనిచేశాయి. బస్సులు తిరిగాయి.



ఏఎస్‌పేట: కానరాని బంద్ వాతావరణం



సంగం: జాతీయ రహదారిపై పోలీసుల బందోబస్తు



అనంతసాగరంలో జాడ లేని బంద్

భారీ శబ్దాలు చేసే బైక్‌లు సీజ్

కావలి: పట్టణంలో విచ్చలవిడిగా భారీ శబ్దాలతో బైక్‌లను రోడ్లపై తిప్పుతూ ప్రజలను తీవ్ర అసౌకర్యానికి, ఇబ్బందులకు గురి చేస్తున్న పోకిరీలపై సోమవారం డీఎస్పీ ఎం.వెంకటరమణ కొరడా ఝళిపించారు. కొందరు పోకిరీలు బైక్‌లకు కంపెనీలు ఏర్పాటు చేసే సైలెన్సర్లను తొలగించి, భారీ శబ్దాలు వచ్చే విధంగా చెవులకు చిల్లులు పడేలా భీకరమైన శబ్దాలు చేస్తూ రోడ్లపై బైక్‌లను దూసుకుపోతున్నారు. వీటిపై దృష్టి పెట్టిన డీఎస్పీ సోమవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో పోలీస్ సిబ్బందితో తనిఖీలు చేయించి అటువంటి వాహనాలను సీజ్ చేశారు. సైలెన్సర్లను తొలగించి, వాహనచోదకులను హెచ్చరించారు.



సీజ్ చేసిన బైక్‌లను పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటరమణ

మినీ వ్యాను, బైక్ ఢీ: రైతు మృతి

వరికుంటపాడు: మినీ వ్యాను, బైక్ ఢీకొని ఓ రైతు తీవ్రంగా గాయపడి నెల్లూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం సాయంత్రం వరికుంటపాడు బస్టాండ్ సెంటర్‌లో జరిగింది. గ్రామానికి చెందిన ఆంధ్రా భాస్కర్‌రెడ్డి (43) పొలం పనులు చూసుకుని ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా పామూరు వైపు నుంచి దుత్తలూరు వైపు వెళ్తున్న మినీ వ్యాను బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో భాస్కర్‌రెడ్డి తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆయన్ను స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఆత్మకూరుకు అక్కడి నుంచి నెల్లూరుకు తరలించారు. అయితే నెల్లూరులోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయశ్రీనివాస్ తెలిపారు.



ఘటన స్థలంలో తీవ్రంగా గాయపడిన భాస్కర్‌రెడ్డి

వైద్య సదుపాయాల మెరుగునకు కృషి

చేజర్ల: చేజర్ల పీహెచ్‌సీలో మెరుగైన వైద్య సదుపాయాలు అందించేందుకు కృషి చేస్తానని ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల వైద్యులు అందుబాటులో లేక గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారనే సమాచారం తనకు అందిందని తెలిపారు. ప్రతి విభాగాన్ని క్షుణ్ణంగా పరిశీలించి రోగులకు అందుతున్న వైద్యంపై ఆరా తీశారు. హాస్పిటల్ అభివృద్ధికి ప్రభుత్వం చేపట్టిన నాడు-నేడు పనులను పరిశీలించారు. సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించి పలువురు సిబ్బంది గైర్హాజరుపై అసహనం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సహకారంతో ఆస్పత్రిలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. ఆయన వెంట చేజర్ల సర్పంచ్ ఆవుల వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ ఉడతా పుల్లయ్య యాదవ్, రెండో వార్డు సభ్యులు ఒంటేరు సుధీర్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.



చేజర్ల పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీపీ విజయభాస్కర్‌రెడ్డి

ప్రతి పంచాయతీలో ఉపాధి పనులు

వరికుంటపాడు: మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో ఉపాధి పనులు తప్పనిసరిగా ప్రారంభించాలని ఎంపీడీఓ చేవూరి శ్రీదేవి అన్నారు. ఆమె సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కూలీలకు సంబంధించి ఆధార్ సీడింగ్, ఈకేవైసీ, మ్యాపింగ్ త్వరితగతిన చేయాలన్నారు. ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా కూలీల హాజరు నమోదు చేయాలన్నారు. కొలతల ప్రకారం పనులు కేటాయించాలన్నారు. ప్రతి కూలీ ప్రభుత్వం నిర్దేశించిన కూలీ నగదు పొందేలా చూడాలన్నారు. ఇన్‌చార్జి ఏపీఓ వెలుగోటి శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఈఓగా కృష్ణప్రసాద్ బాధ్యతల స్వీకరణ

కలిగిరి: మండలంలోని తెల్లపాడులో కొలువైన శ్రీకోదండరామస్వామి దేవస్థానం ఈఓగా కోవూరు గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఈఓ సీహెచ్ కృష్ణప్రసాద్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తగా ఉన్న మార్లేళ్ల వెంకటశేషారెడ్డి నియామకం చెల్లదంటూ గ్రామస్తులు ఫిర్యాదుల మేరకు దేవదాయశాఖ అధికారులు విచారణ జరిపారు. ఆయన్ను వ్యవస్థాపక ధర్మకర్తగా నియమించిన ఉత్తర్వులను రద్దు చేశారు.

బాధ్యతగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

- మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావు

ఆత్మకూరు: రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు ఈ నెల 15వ తేదీ నుంచి చేపట్టనున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే బాధ్యతగా నిర్వహించాలని ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ బి.నాగేశ్వరరావు సూచించారు. మున్సిపల్ కార్యాలయ ఎంజీఆర్ సమావేశ మందిరంలో సోమవారం జగనన్న సురక్ష సర్వేపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష సర్వే ద్వారా వలంటీర్లు, హెల్త్ సెక్రటరీలు, సచివాలయాల పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి హెల్త్ సర్వే నమోదు చేసి పలు రకాల ఆరోగ్య పరీక్షలు ఉచితంగా నిర్వహించాలన్నారు. అవసరమైన వారికి అక్టోబరులో అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఆరోగ్య సురక్షా మెడికల్ క్యాంపు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఉచితంగా మందులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ షేక్ అస్మా, అడిషనల్ సీడీపీఓ సునీలత, ఎంహెచ్ఈఓ ఎస్ సుధాకర్, సచివాలయ ఆరోగ్య కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న వలంటీర్లు, హెల్త్ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది

సొంత నిధులతో లేఅవుట్ స్థలం చదును



జేసీబీతో స్థలాన్ని చదును చేస్తున్న దృశ్యం

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం పంచాయతీలో ఇల్లు లేని నిరుపేదలకు జగనన్న ఇంటి స్థలాలు మంజూరు చేయించాలనే ఉద్దేశంతో పాత చేపల పెంపకం కేంద్రం ప్రభుత్వ స్థలానికి అనుమతులు ఇచ్చారు. లేఅవుట్‌కు అనుగుణంగా సోమవారం జీఎంకే చారిటబుల్ ట్రస్ట్ అధినేత, మండల వైస్ ఎంపీపీ గుంటుపల్లి మాలకొండయ్యచౌదరి తన సొంత నిధులతో మాజీ ఎంపీటీసీ సభ్యుడు పాముల రమణయ్య కలిసి స్థల చదును పనులు చేపట్టారు. ఇదే ప్రాంతంలో గతంలో వేసిన లేఅవుట్‌లో సుమారు 40 మందికి మొదటి విడతలో జగనన్న పక్కాగృహాలు మంజూరు చేయగా పనులు వేగంగా జరుగుతున్నాయి. సుమారు మరో 50 మంది నిరు పేదలకు రెండో విడతలో స్థలాలు కేటాయించనున్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆర్.తిరుపతి, గఫూర్, బాషా పాల్గొన్నారు.

జంప్‌రోప్ పోటీల్లో కావలి విద్యార్థులకు గోల్డ్‌మెడల్

కావలి: తెనాలిలో జరిగిన రాష్ట్రస్థాయి జంప్ రోప్ రాష్ట్రస్థాయి పోటీల్లో కొత్తసత్రం హైస్కూల్ విద్యార్థినులు కే మాధవి, కల్పన, శాలిని, జ్యోతి, సరిత గోల్డ్‌మెడల్స్ సాధించారు. ఈ మేరకు సోమవారం పాఠశాలలో హెచ్‌ఎం శ్రీనివాసరావు, పీడీ మురళి, ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు అభినందించారు. జాతీయ స్థాయి పోటీలకు సెలెక్ట్ అయి ఈ విద్యార్థినులు బాగా రాణించి కొత్తసత్రం హైస్కూల్‌కు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు.



గోల్డ్‌మెడల్ సాధించిన విద్యార్థినులతో హెచ్‌ఎం శ్రీనివాసరావు